**"ఈ కేసులో మీకున్న ఇంట్రెస్ట్ ఏంటి?" డిటెక్టివ్ నందన్ ఎదుటి వ్యక్తి ముఖంలోని భావాలు చదవడానికి ప్రయత్నిస్తూనే ప్రశ్నించాడు.**

అతడు తడుముకోకుండా జవాబు చెప్పాడు. "ఒక్క రాత్రి... ఒకే ఒక రాత్రి ఆమెతో గడిపాను. షి టచ్డ్ మై హార్ట్... ఆ రాత్రి మనిషిలోని మనిషిని చూసాను... అందుకే ఆమె ఈ నేరం చేయలేదనే అనుకుంటున్నాను."

నందన్ అదోలా నవ్వాడు. "మిస్టర్ కార్తీక్! ఆమె ఓ మోడల్. హైక్లాస్ కాల్‌గర్ల్... డబ్బుకోసం శరీరాన్ని అమ్ముకోవడం చట్టరీత్యా నేరమైనప్పుడు, నేరము చేయడానికి తను సిద్ధపడ్డట్టే కదా?!"

కార్తీక్ తల అడ్డంగా ఆడించాడు "నో సార్! అడ్డదారి తొక్కిన వాళ్ళందరూ ప్రతి అడ్డమైన పని చేస్తారనుకోవడం కరెక్ట్‌కాదు. మంచితనం ముసుగేసుకున్నవాళ్ళు ఒక్కోసారి ఘోరమైన తప్పులు, నేరాలు, ఘోరాలు చేస్తుంటారు."

అర నిముషం మౌనం తర్వాత డిటెక్టివ్ నందన్ అతడితో చెప్పాడు. "కేవలం ఒక్క రాత్రి తనతో గడిపినందుకే, ఇంతలా కదిలిపోయి ఆమెను కాపాడాలనుకుంటున్నప్పుడు, మీ తాలూకూ ఆ మానవత్వం చూసైనా నేను ఈ కేసు టేకప్ చేయాలి...చేస్తున్నాను."

* * *

మోడల్ లలిత కేసు ఫైల్‌ని డిటెక్టివ్ నందన్ ముందుంచాడు అతడి అసిస్టెంట్ రాజేష్... 'ఇండస్ట్రియలిస్ట్ విశాల్ నాలుగేళ్ళ కొడుకును లలిత కిడ్నాప్ చేసి యాభై లక్షలు డిమాండ్ చేస్తుందనేది' ఆ ఫైల్ సారాంశం.

మరో అర్ధగంట తర్వాత నందన్, తన అసిస్టెంట్‌తో కలసి పోలీస్‌స్టేషన్‌కి బయలుదేరాడు.

ఎస్.ఐ. రాములు అతడికి పరిచయస్తుడే కావడంతో సాదరంగా ఆహ్వానించి, "మీరిలా వచ్చారేంటి సార్?" ప్రశ్నించాడు.

"మోడల్ లలిత కేసు నేను టేకప్ చేసాను" అతడు చూపించిన కుర్చీలో కూర్చుంటూ జవాబిచ్చాడు నందన్.

రాములు ఆశ్చర్యంగా "అదేంటి సార్! ఇలాంటి కేసు టేకప్ చేసారు?" అడిగాడు.

"ఈ కేసుకేమయ్యింది?"

"ముద్దాయి నేరం చేసినట్టు పక్కా సాక్ష్యాధారాలున్నాయి."

నందన్ అదోలా నవ్వాడు. "ఎలాంటి సాక్ష్యాధారాలు?!"

"లలిత, విశాల్‌కి ఫోన్‌చేసినట్టు అతడి మొబైల్‌లో ఆమె నెంబర్ రికార్డయ్యింది."

"కిడ్నాపర్ తన మొబైల్ నుండి కాల్ చేసి బెదిరించాడనే విషయం, ఎస్.ఐగా మీకూ తెలుసనుకుంటానూ?"

అతడు తడబడి "అంతేకాదు, స్కూల్‌దగ్గరనుండి కుర్రాడ్ని ఆమే తీసుకెళ్ళిందని వాచ్‌మెన్ చెప్పాడు. ఆ విధంగా ప్రత్యక్షసాక్ష్యమూ వుంది" వెంటనే చెప్పాడు.

నందన్ తలాడించాడు. "ఏ సాక్ష్యానికి ఎంత బలముందో, త్వరలోనే తెలుస్తుంది..."అని ఆగి వచ్చిన పని చెప్పాడు. "నేనోసారి ఆమెను కలవాలి."



# మోడల్

"వెళ్ళి కలవండి" లాకప్ గది వైపు చెయ్యి చూపించాడు.

నందన్ అటుగా నడిచాడు. లాకప్ గది దగ్గరగా వెళ్ళాక మెల్లగా పిలిచాడు. "మిస్ లలితా" సిమెంట్ చప్టామీద కూర్చుని మోకాళ్ళలో తల దాచుకుని వున్న ఆమె నెమ్మదిగా తలెత్తి అతడిని చూసింది.

ముప్పయ్యేళ్ళలోపు వయసే వుంటుందామెకు. అందగత్తెలే మోడల్స్ అవుతారు. కాబట్టి ఆమె అందగత్తె అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాకపోతే దిగులు, భయం, నీరసం - అన్నీ కలగలసిపోయిన దైన్యస్థితివలన కాబోలు ఆమె ముఖంలో 'కళ'మాయమయ్యింది.

జె.వి.బాబు

అతడు తనను తాను పరిచయం చేసుకుంటూ చెప్పాడు. "నా పేరు శ్రీనందన్...డిటెక్టివ్ నందన్... మీ కేసు నేనే టేకప్ చేసాను... అందుకే మీనుండి కొన్ని వివరాలు సేకరించడానికి వచ్చాను... ప్లీజ్! దగ్గరగా రండి."

ఆమె ముఖంలో ఆశ్చర్యం కదలాడింది. అతడికేసి అపనమ్మకంగా చూసింది. అరనిముషం తర్వాతనే లాకప్ డోర్ దగ్గరగా వచ్చింది. "మిమ్మల్నెవరు అపాయింట్ చేసారు."

"అదంతా తర్వాత చెపుతాను... ముందీ విషయం చెప్పండి. విశాల్ మీ మీద ఆ నిందారోపణ ఎందుకు చేసాడు?!"

ఆమె పెదవులు బిగపట్టింది. కళ్ళనుండి నీళ్ళు ధారగా కారసాగాయి. 'నేనున్నాను'అంటూ ఎవరూ అండగా లేకపోవడంతో, బయటపెట్టలేక దాచుకున్న దుఃఖం, ఆ చిన్న ప్రశ్నతో పొంగిపొరలింది.
చాలాసేపటివరకూ ఆమెను ఏడవనిచ్చాడు. ఆ తర్వాత మరోసారి ప్రశ్నించాడు. "నువ్వు నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు లలితా."

లలిత తలెత్తి చూసింది "అతడి నిందారోపణల విషయం పక్కన పెడితే... ఏ తల్లి తన బిడ్డను కిడ్నాప్ చేయలేదు కదా సార్."

నందన్ షాకయ్యాడు. కొద్ది క్షణాల తర్వాత తనలోతాను అనుకుంటున్నట్టుగా పైకే అన్నాడు. "విశాల్ కొడుకు... మోడల్ లలిత కడుపున పుట్టినవాడా...?!... ఎలా?!"

గతమంతా చెప్పాక ఆమె పలికింది. "నిజంగా నాకే పాపమూ తెలియదు సార్!... విశాల్ ఎందుకు టార్గెట్ చేసాడో కూడా అర్థంకావడంలేదు."

"మరి స్కూల్ వాచ్‌మెన్ నువ్వు ఆ పిల్లాడిని కార్లో ఎక్కించుకుని వెళ్ళడం చూసానని చెపుతున్నాడు."

"అప్పుడప్పుడు స్కూల్‌కి వెళ్ళి వాడిని నా వెంట తీసుకెళ్ళి కావలసినవి తినిపించి, తిరిగి స్కూల్ దగ్గర వదలడం చాలాకాలంగా జరుగుతూ వస్తున్నదే... నిన్న ఆ వాచ్‌మెన్ నేను కార్లో తీసుకెళ్ళడం చూసాడు గానీ, తిరిగి వచ్చి దిగబెట్టడం చూడలేదు."

డిటెక్టివ్ నందన్ తలాడించాడు. "ఒ.కే...మనం మళ్ళీ కలుద్దాం లలితా."

అతడు వెనుతిరిగి రెండడుగులేసాక వెనుకనుండి వినిపించింది. "సార్! నన్ను జైల్లో వుంచినా బాధపడను. నా బిడ్డ క్షేమంగా వుండేలా చూడండి... ప్లీజ్".

నందన్ స్టేషన్‌నుండి బయటకు నడిచాడు.

* * *

విశాల్, ప్రమద్వరల అంశను తన కడుపులో మోసి ఓ బిడ్డకు జన్మనివ్వడానికి ఒప్పుకుంది లలిత.
అప్పటికి కెరీర్ పరంగా ఆమెకు సరైన గుర్తింపు లేదు. పెద్దమొత్తంలో అందుతున్న డబ్బుకోసం కడుపు అద్దెకివ్వడానికి ఒప్పుకుంది.

ఇలాంటి కేసుల్లో బిడ్డను కన్న వ్యక్తి ఎవరో 'అద్దె'చెల్లించేవారికి తెలియదు. అలాగే తను కనబోతున్న బిడ్డకు తల్లిదండ్రులెవరో అద్దెకిచ్చిన ఆడదానికీ తెలియనివ్వరు. ఐతే ఒక రోజువ అనుకోకుండా తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి ఇండస్ట్రియలిస్ట్ విశాల్ అని తెలుసుకుంది లలిత.

బిడ్డను హాస్పిటల్‌లో వదిలి వెళ్ళాక ఒకటీ, రెండు సంవత్సరాల వరకూ లలిత కెరీర్ మీద కాన్‌సన్‌ట్రేషన్ చేసింది. ఆ తర్వాత కడుపుతీపి కన్నబిడ్డను చూడాలనిపించింది.

విశాల్‌ని కలసి తనెవరో, తన కోరిక ఏమిటో వివరించింది. అతడు మొదట కంగారుపడ్డాడు. ఆమె ఇచ్చిన భరోసాతో తన కోరిక తీర్చడానికి అంగీకరించాడు.

అప్పటినుండి లలిత అప్పుడప్పుడు ఆ ఇంటికెళ్ళి వచ్చేది. ప్రమద్వర ఇబ్బందిని గుర్తించాక, స్కూల్‌కి వెళ్ళిరావడం అలవాటు చేసుకుంది.

మరి ఎప్పటినుండో సాగుతున్న ఈ వ్యవహారంలో ఈ కొత్త ట్విస్ట్ ఏంటి?

నందన్ తన అసిస్టెంట్ రాజేష్‌కి ఫోన్ చేసాడు. "ఎక్కడున్నావ్?"

"విశాల్‌ని ఫాలో అవుతూ, అతడి ఆఫీస్‌వరకూ వచ్చాను."

"అనుమానించాల్సిన విషయాలేమైనా వున్నాయా?"

"ఒక్కగానొక్క కొడుకు కిడ్నాప్‌కి గురైనప్పుడు, ఆ తండ్రి అంత సులభంగా ఆఫీస్ పనులు చక్కబెట్టుకోలేడు కదా సార్."

రాజేష్ ఏం చెప్పదలచుకున్నాడో అతడికి అర్థమయ్యింది.

కాల్ కట్ చేసాక, మరో అసిస్టెంట్ ఈశ్వర్‌కి కాల్ చేసి అడిగాడు. "మిసెస్ విశాల్ మూవ్‌మెంట్ ఏంటి?"

"ఆమె ఇంట్లోంచి బయటకు రాలేదు."

"ఐతే నువ్వే లోపలికి వెళ్ళి పలకరించే ప్రయత్నం చెయ్యాలి."

"అలాగే సార్."

పావుగంట తర్వాత ఈశ్వర్ నుండి అతడికి కాల్ వచ్చింది. "నూతనగారు చాలా డిస్టర్బ్‌డ్‌గా వున్నారు సార్! కాని...కుర్రాడైతే ఇంట్లో కనిపించలేదు."

"అలాగా..."అని ఆగి ఎగ్జయిట్‌గా "...వాట్?... ఆమె... ఆమె పేరేమిటన్నావ్?!" అడిగాడు.

"నూతన".

"మరి ప్రమద్వర."

"ప్రమద్వర ఎవరు సార్?"

"విశాల్ భార్య పేరు ప్రమద్వర."

"నిజమా?!"

పది క్షణాల నిశ్శబ్దం తర్వాత నందన్ అన్నాడు. "సరే! నేను విశాల్‌ని కలుస్తాను. నువ్వు అక్కడేవుండి, మూవ్‌మెంట్స్ గమనించు."

"ఎస్సర్."

❊ ❊ ❊

డిటెక్టివ్ నందన్ తననుతాను పరిచయం చేసుకున్నాక అడిగాడు. "ప్రమద్వరగారిని నేనోసారి కలిసి మాట్లాడవచ్చా?"

విశాల్ కంగారుపడ్డాడు. "ప్రమద్వరతో మాట్లాడుతారా?!... ఎందుకు?!"

"మీ అబ్బాయి...అదే నిఖిల్ ఎలా తప్పిపోయాడో... ఐ మీన్ కిడ్నాప్‌కి గురయ్యాడో వివరంగా అడిగి తెలుసుకుందామని."

అతడు తలదించుకున్నాడు. కాసేపటి తర్వాత తలెత్తి "ప్రమద్వర సంవత్సరం క్రితమే కార్ యాక్సిడెంట్‌లో చనిపోయిన విషయం మీకు తెలియదనుకుంటాను" అన్నాడు.

"అలాగా..."అని ఆగి, చాలా కూల్‌గా ప్రశ్నించాడు. "...ప్రమద్వర చనిపోయిన ఆర్నెల్ల తర్వాత మీరు పెళ్ళాడిన నూతనగారు ఇప్పుడు ప్రెగ్నెంట్ అనుకుంటాను?"

"అ...అవును."



తను కనబోతున్న బిడ్డకు తల్లి దండ్రులెవరో అద్దెకిచ్చిన ఆడదానికీ తెలియనివ్వరు. ఐతే ఒక రోజున అనుకోకుండా తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి ఇండస్ట్రియలిస్ట్ విశాల్ అని తెలుసుకుంది లలిత.

"మరి నూతనగారు నిఖిల్‌తో హ్యాపీగానే వుంటారా?"

"వుంటుంది."

"సరే మనం మళ్ళీ కలుద్దాం" నందన్ కుర్చీలో నుండి లేస్తూ పలికాడు.

విశాల్ చెయ్యి అందించాడు.

అదే క్షణం డిటెక్టివ్ నందన్ మరో చెయ్యి వేగంగా కదిలి ఓ వస్తువు అందుకోవడం విశాల్ గమనించలేదు.

నందన్ ఆ ఆఫీసునుండి బయటకొచ్చాక, చేతిలో వున్న ఆ వస్తువుకేసి చూసాడు. విశాల్ మొబైల్ ఫోన్ అది.

స్పీడ్ డయల్‌లో వుందా పేరు... నూ...త...న!

అతడు నంబర్ డయల్ చేయగానే అవతలి నుండి వినిపించింది. "హలో!... ఆఫీస్‌కి చేరుకున్నారా?"

విశాల్ గొంతును అనుకరించాడు నందన్. "నూతనా!... నువ్వు వెంటనే నిఖిల్ దగ్గరకు వెళ్ళు... అర నిముషం కూడా ఆలస్యం చేయకు."

"ఎందుకు?"

"వెళ్ళు..." నందన్ ఫోన్ కట్ చేసాడు.

తన మొబైల్ బయటకు తీసి ఈశ్వర్‌తో మాట్లాడాడు. "నూతన ఇప్పుడు ఇంట్లోంచి బయటకొచ్చి, ఎక్కడకెళ్తుందో ఫాలో అయ్యి తెలుసుకో."

చివరగా ఎస్.ఐ. రాములుకు ఇన్‌ఫర్మేషన్ అందించాక ఈశ్వర్ నుండి కాల్‌కోసం ఎదురుచూడసాగాడు- డిటెక్టివ్ నందన్.

ఈశ్వర్‌నుండి కాల్ వచ్చింది.

❊ ❊ ❊

గెస్ట్‌హౌస్‌లోనుండి బయటకొస్తున్న నూతన చుట్టుముట్టిన పోలీసులను చూసి భయపడిపోయింది.

ఆమె ఆ షాక్‌లో వుండగానే డిటెక్టివ్ నందన్ లోపలికి పరుగెత్తాడు. ఓ గదిలో బందీగా వున్న నాలుగేళ్ళ కుర్రాడిని బయటకు తీసుకొచ్చాడు.

"మిసెస్ నూతనా విశాల్‌గారూ! మీరే ఈ కుర్రాడ్ని కిడ్నాప్ చేసి, కిడ్నాప్ కేసు మోడల్ లలిత మీదకు నెట్టారని అర్థమవుతోంది. మోడల్ లలితను కేసులో ఇరికించాలన్న ఆలోచన మీకెందుకు కలిగిందో నాకర్థమవుతూనే వుంది. కాని మీ నోటినుండి వినాలని వుంది... పోలీస్‌స్టేషన్‌లో వివరంగా చెపుతారనే అనుకుంటున్నాను."

పోలీస్ జీప్ అక్కడినుండి కదిలింది.

❊ ❊ ❊

పోలీస్ అదుపులోకి తీసుకున్న విశాల్ తన ప్లాన్ గురించి వివరంగా చెప్పసాగాడు. "ప్రమద్వరకు బిడ్డలు పుట్టే అవకాశం అసలులేదని తెలుసుకున్నాక, మోడల్ లలిత ద్వారా బిడ్డను కనడం జరిగింది. ఐతే ప్రమద్వర అనుకోకుండా యాక్సిడెంట్‌లో చనిపోయాక, నేను నూతనను పెళ్ళిచేసుకున్నాను. నూతన గర్భవతి అయ్యాక నిఖిల్ మీద మాకు ప్రేమ తగ్గిపోతూ వచ్చింది. బట్, లలిత వైపునుండి ఎలాంటి ప్రమాదం వస్తుందోనన్న భయమూ మాలో వుంది. ఎందుకంటే ఎప్పటికైనా నిఖిల్‌ని మా వారసుడిగా అంగీకరించాలి. నూతనకు అది ఇష్టంలేదు. అందుకే నిఖిల్‌ని మా కుటుంబంనుండి దూరం చేయాలనుకుంది. అలాగని వాడికి కీడు తలపెట్టడం మా ఉద్దేశ్యం కాదు... వాడిని ఏ దూర ప్రాంతాలకో పంపించి హాస్టల్‌లో వుంచి చదువు చెప్పించాలనుకున్నాం. కాని తన బిడ్డ కనపడకపోతే లలిత గొడవ చేసే అవకాశముంది. అందుకే ప్లాన్‌చేసి ఆమెనే కేసులో ఇరికించాం. పిల్లవాడు కిడ్నాప్ అయ్యాడన్న అబద్ధాన్ని అలా కంటిన్యూచేసి, లలితను మా నుండి దూరంచేస్తే, ఆ తర్వాత నిఖిల్‌ని దూరం పంపించేయడం కష్టం కాదనే మా ఉద్దేశ్యం... అన్నింటికన్నా ముఖ్యంగా లలిత కేసునుండి బయటపడడానికే ప్రయత్నిస్తుందనుకున్నాం తప్ప, ఇలా పిల్లాడ్ని వెతికించే పని చేస్తుందనుకోలేదు."

తలదించుకున్న భార్యాభర్తలకేసి అసహ్యంగా చూస్తూ నిఖిల్‌ని దగ్గరగా తీసుకుంది లలిత.

డిటెక్టివ్ నందన్ ఆమె దగ్గరగా నడిచి ముఖంలోకి చూస్తూ నవ్వాడు. "ఎనీహౌ! నువ్వు ఈ కేసునుండి బయటపడడమే కాదు, నీ బిడ్డ వీరి సంరక్షణలో సేఫ్‌గా వుండలేడని తెలుసుకున్నావ్. ఇక ఎలాంటి నిర్ణయం తీసుకుంటావో నీ ఇష్టం."

అతడు పోలీస్‌స్టేషన్ నుండి బయటకు నడుస్తుంటే లలిత అడిగింది. "సార్! నన్ను రక్షించడానికి మిమ్మల్ని అపాయింట్ చేసిన ఆ వ్యక్తి ఎవరు?"

నందన్ దీర్ఘంగా నిశ్వసించాడు. "నీ శ్రేయోభిలాషి" చెప్పాక బయటకు నడిచాడు.

★